మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక  ఇది జనం గొంతుక

10.3.2026 మంగళవారం Tuesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 320 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## వరల్డ్ కప్ విజయం ఆ ఇద్దరికే అంకితం



# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

## సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు

- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారానే పోలీసు శాఖకు గౌరవం పెరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయని, ఇవి పోలీసులకు సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. భౌతికంగా కనిపించని నేరాలను కనిపెట్టడం సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. కొత్త సవాళ్లు ఎదుర్కోవాలంటే పోలీసు అధికారులు అప్ గ్రేడ్ కావాలని అన్నారు.**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామో తెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా

మిగతా 2 లో

## మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

- చెరువుల పునరుద్ధరణ కొనసాగుతుంది
- నిర్వాసితులకు డబుల్ ఇళ్లు ఇస్తాం
- కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభం
- చెరువుకు హారతి ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి

2



## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2



## రాజ్యసభకు ఏకగ్రీవం

- తెలంగాణ నుంచి ఇద్దరికీ ధృవపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- సమస్యలను పరిష్కరించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్న వేం నరేందర్ రెడ్డి

02



## రైతుబంధు పథకం బంద్... రాహుల్ బంద్ స్టార్ట్

### ముఖ్యమంత్రి రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తేసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు.

03



## కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..
- కవిత సహా 23 మందికి నోటీసులు

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు

.. వివరాలు 2లో

## క్రషర్ నాదని ఎలా అంటారు

- ఏ కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో తెలుసు
- బీఆర్ఎస్ నేతల విమర్శలపై పొంగులేటి ఆగ్రహం



తనపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లో తనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఆయన సీరియస్ అయ్యారు. అవుటర్ రింగ్ రోడ్డు పక్కన సంబంధం లేని క్రషర్ నాదని పిచ్చి కుక్కలు చాలా మొరుగుతున్నాయన్నారు.

02



## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

04

- ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా
- దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు

ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ ఇరాన్ తన కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త నేతగా ప్రకటించింది.



# రాజ్యసభకు ఏకగ్రీవం

**హైదరాబాద్,మార్చి9 :** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# క్రషర్ నాదని ఎలా అంటారు

## ఏ కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో తెలుసు

## బిఆర్ఎస్ నేతల విమర్శలపై పొంగులేటి ఆగ్రహం

**హైదరాబాద్,మార్చి 9 :** తనపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లో తనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఆయన సీరియస్ అయ్యారు. అవుటర్ రింగ్ రోడ్డు పక్కన సంబంధం లేని క్రషర్ నాదని పిచ్చి కుక్కలు చాలా మొరుగుతున్నాయన్నారు. ఏ కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో తనకు తెలుసునని చెప్పారు. ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు క్రషర్ నడిపే ఓపిక లేదు.. అది తన క్రషర్ కాదని కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ నేతలు చెబుతున్నది తిరుమల క్రషర్ అని చెప్పారు. వేస్ట్ క్రష్ చేసి సప్లై చేసే లైసెన్స్ వారికి ఉందని పేర్కొన్నారు. ఆ క్రషర్ కంపెనీ తమ కంటైనర్ తీసుకు వెళ్ళిందన్నారు. దానిపై ఉన్న పేరు వారు తొలగించినట్లు ఉన్నారని వివరించారు. దానిని పట్టుకుని పిచ్చి వాగుడు వాగుతున్నారంటూ బీఆర్ఎస్ నేతల ఆరోపణలను తిప్పికొట్టారు. ÷లుగుపట్లలో 410 మంది నిజమైనవారు ఉన్నారని.. 330 మంది బోగస్ అని తేలిందన్నారు. 410 మందికి త్వరలోనే స్థలాలు ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. తనపై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతానంటూ బీఆర్ఎస్ నేతలకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

## ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

**హైదాబాద్,మార్చి9 :** తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో-4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో-1 ఫెనైల్-1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷-దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# తిరుపతి జిల్లాలో విషాద ఘటన

## కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి

తిరుపతి,మార్చి9 : జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు.



దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు. రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

## ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు

## ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ

## క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,మార్చి9 :** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

## చెరువుల పునరుద్ధరణ కొనసాగుతుంది

## నిర్వాసితులకు డబుల్ ఇళ్లు ఇస్తాం

## కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభం

## చెరువుకు హారతి ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి 9 :** మూసీ అభివృద్ధిని అడ్డుకోవడమంటే..తెలంగాణ పురోగతిని అడ్డుకోవడమే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిర్వాసితుల్లో అర్హులైన పేదలు ఉంటే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తాం. పేదవాడి ఇల్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. వరదల వల్ల ఇళ్లు మునిగిపోతే కుటుంబం మొత్తం నష్టపోతుంది. వరద ముప్పును తప్పించాలంటే చెరువులను పునరుద్ధరించాలి. మూసీని పునరుద్ధరించకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని అన్నారు.. భాజపా ప్రభుత్వాలు గంగా, సబర్మతి, సరయూ నదుల అభివృద్ధిని చేపట్టలేదా? మూసీ అభివృద్ధిని మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని, దీనివల్ల ఎవరికైనా నష్టం జరిగితే మంచి పరిహారం ఇచ్చి ఆదుకుంటాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నల్ల చెరువు అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైడ్రా పునరుద్ధరించిన కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీఎంగా మీ ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఆనాడు ఎంపీగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఉన్నా నిధులు లేక చేయలేకపోయా. ఇప్పుడు అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాను. చెరువుల పునరుద్ధరణ వల్ల పేదలకు నష్టం కలిగి ఉండవచ్చు. గతంలో తాను మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో నిధులు లేక ఈ నల్లచెరువును అభివృద్ధి చేయలేక పోయినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లిలో ప్రస్తుతం నల్లచెరువు అభివృద్ధిని చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను 100 శాతం అభివృద్ధి చేస్తానన్నారు. కూకట్‌పల్లిలో నల్లచెరువును హైడ్రా పునరుద్ధరించగా,సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నల్లచెరువుకు గంగా హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధి తో పాటు సంక్షేమంపై దృష్టి పెడతామని తెలిపారు. ఏ పేదవాడి ఇల్లు కూలగొట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. హైడ్రా తెచ్చినప్పుడు చాలా విమర్శలు వచ్చాయన్నారు. చెరువులు, కాల్వలు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తే అనేక ఇబ్బందులొస్తాయని తెలిపారు. ప్రభుత్వానికి సహకరించాలంటూ ఈ సందర్భంగా చెరువులు, నాలాల ఆక్రమణదారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందన్నారు. అలాగే నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారు. చెరువులను అభివృద్ధి చేసుకోవాలని ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. కొందరికి కష్టం వచ్చినా.. బాధపడినా చెరువులను అభివృద్ధి చేస్తున్నామని కుండబద్దలు కొట్టారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరుతున్నానంటూ ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. ఢిల్లీలో కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. ఢిల్లీ లాంటి పరిస్థితులు మనం తెచ్చుకోకూడదంటూ హైదరాబాద్ నగర ప్రజలకు తెలంగాణ సీఎం హితవు పలికారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకోవాలంటూ నగర ప్రజలకు సీఎం రేవంత్ సూచించారు. హైడ్రా మొదలైనప్పుడు చాలా విమర్శలు, ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కానీ అవన్నీ తాను మౌనంగా భరించానన్నారు. కానీ ఇప్పుడు ఈ డెవలప్‌మెంట్ చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుంటే తనను తిట్టిన తిట్లు కూడా ఆశీర్వాదంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇక్కడ అనధికారికంగా నివాసాలు నిర్మించుకున్న కొందరని ఇబ్బంది పెట్టి ఉంటామని.. వారందరికీ డబుల్ బెడ్ రూంలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. చెరువులు కబ్జాకు గురైతే వరదలు వస్తే ఇంట్లోకి వచ్చి మన వస్తువులు మొత్తం మునిగిపోతాయని వివరించారు. చెరువులను ఆక్రమించిన వాళ్ళు సహకరించాలని కోరుతున్నానని తెలిపారు. ఇలాంటి ప్రదేశాల్లో మహిళలకు స్వయం సహాయక స్టాల్స్ ఏర్పాటు చేయమని చెప్పానని గుర్తు చేశారు. చిన్న పిల్లలకు ఆట స్థలం కోసం కూడా ఈ పార్కులు పనికి వస్తాయన్నారు. ఇక్కడ ఇంతకు ముందు కోరినట్లు షటిల్ కోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. నాలాలకు రక్షణగా గోడలు కట్టాలన్నారు. ఢిల్లీలో పార్లమెంట్‌కు సెలవులు ప్రకటించే పరిస్థితి పొల్యూషన్ వల్ల వచ్చిందని గుర్తు చేశారు. ముందు చూపు లేక ఢిల్లీకి ఆ పరిస్థితి వచ్చిందన్నారు. బొంబాయిలో వర్షం కురిస్తే ఇంట్లోంచి బయటకి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కి రావద్దంటే మూసి ప్రక్షాళన చేయాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. మూసి ప్రక్షాళన వద్దంటే అది హైదరాబాద్ ఫ్యూచర్‌ను అడ్డుకున్నట్లేనని పేర్కొన్నారు.

నిధులు ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. మంచి అధికారులను మీకు ఇచ్చానని తెలిపారు. పని చేయించుకోవడం మీ వంతు అంటూ ప్రజలకు సూచించారు. సరైన డాకుమెంట్స్ ఉంటే టీడీఆర్ ఇవ్వమని చెప్పానని గుర్తు చేశారు. ఇక్కడ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోకండంటూ ప్రజలకు హితవు పలికారు. తాను కష్ట కాలంలో ఉన్నప్పుడు ఇక్కడ తనను ఎంపీగా గెలిపించారని చెప్పారు. తన తల తాకట్టు పెట్టయినా అప్పు తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. పార్టీలకు అతీతంగా ఇక్కడ అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అందరు అభివృ కి సంపూర్ణంగా సహకరిస్తారని తాను భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

## ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన

## ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

## కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



**ఖమ్మం,మార్చి9 :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు.

తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# కవితకు మళ్లీ నోటీసులు!

## లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..

## కవిత సహా 23 మందికి నోటీసులు

**న్యూఢిల్లీ,మార్చి 9 :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోంది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడుపులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాదిస్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# ఎసిబి వలలో చిక్కిన పోలీసులు

## లక్ష లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్,మార్చి9 :** సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ఆర్ఎస్సైలు ఏసీబీకి చిక్కారు. మల్కాగిజిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌కు చెందిన ఇద్దరు ఎస్సైలు ప్రమోద్ గౌడ్ , జటావత్ బాబు నాయక్ సోమవారం రూ. లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టుబడ్డారు. ఎల్‌బీ నగర్ చౌరస్తాలో ఎస్సై జటావత్ బాబు ఈ డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దాడుల నిర్వహించి పట్టుకున్నారు. లక్ష రూపాయల నగదును పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా విధుల ఉల్లంఘులకు పాల్పడి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఏసీబీ శాఖ సూచించింది. సోషల్ మీడియా నంబర్ 9440446106 అనే వాట్సప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించింది.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సిందే

## దక్షిణమధ్య రైల్వే జిఎంకు బిఆర్ఎస్ వినతి

**హైదరాబాద్,మార్చి9 :** బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్ , మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌బాబు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తో సోమవారం భేటీ అయ్యారు. కాజీపేట రైల్వే డివిజన్ తో పాటు స్థానికులే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కావాలని 40 ఏళ్ల నుంచి డిమాండ్ ఉందని, అయితే కేంద్రం పదేళ్ల క్రితం వ్యాగన్ ఫ్యాక్టరీ కోసం ప్రకటన చేసిందని తెలిపారు. స్థానిక నాయకులు ఈ ప్రాంత రైతులతో మాట్లాడి తక్కువ ధరతో భూమి ఇవ్వడానికి ఒప్పుకున్నారని వివరించారు. అయితే ఫ్యాక్టరీలో స్థానికులకు కాకుండా ప్రైవేట్ వారిచే పనులు చేస్తున్నట్టు జీఎం పేర్కొన్నారని, స్థానికులకు అవకాశమివ్వాలని కోరినట్లు వారు వెల్లడించారు. కాజీపేట రైల్వే డివిజన్ విషయం రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంటుందని జీఎం వివరించారని తెలిపారు. ఉూతూర్‌లో స్థానికులకు ఇచ్చిన విధంగా కాజీపేటలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు



**హైదరాబాద్,మార్చి9 :** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాను అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

# నకిలీ ఆహార పదార్థాల ముఠా పట్టివేత

## కల్తీ నూనెలు, గోధుమపిండి స్వాధీనం

**హైదరాబాద్,మార్చి 9 :** హైదరాబాద్ గచ్చిబౌలిలో పోలీసులు కల్తీ మాఫియా గుట్టురట్టు చేశారు. 5 వేల లీటర్ల కల్తీ వంటనూనె, 5 టన్నుల కల్తీ గోధుమ పిండి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 21 లక్షల విలువ చేసే నకిలీ పదార్థాలను సీజ్ చేశారు. గచ్చిబౌలిలోని ఓ గోదాములో కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిత్యావసరాలు కల్తీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ ముఠాను గుర్తించి దాడి చేశారు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు నిర్వహించిన దాడుల్లో తండ్రీ, కొడుకులను అరెస్టు చేశారు. వట్టినగులపల్లి ఇందిరమ్మ కాలనీలోని శ్రీ జస్నాత్ ట్రేడర్స్ దుకాణంపై ఎస్వోటీ పోలీసులు సోమవారం దాడి చేశారు. గడువు ముగిసిన వివిధ కంపెనీల వంట నూనెలను సేకరించి, సోయాబీన్ నూనెతో కలిపి కల్తీ వంట నూనెను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలా తయారైన నూనెను వివిధ ప్రసిద్ధ బ్రాండ్ల పేర్లతో ప్యాక్ చేసి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు దాడుల్లో బయటపడింది. అదే విధంగా గడువు తీరిన గోధుమ పిండిని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి... 'జస్నాత్ గోల్డ్ చక్కి అట్టా' పేరుతో తిరిగి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రైడ్‌లో సుమారు 10 లక్షల రూపాయల విలువైన 5,026 లీటర్ల కల్తీ వంట నూనె, 3 లక్షల రూపాయల విలువైన 5,192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు. పెయిటింగ్ మెషిన్, ఆయిల్ ఫిల్టర్ మెషిన్, గోధుమ ఫిల్టర్ మెషిన్‌తో పాటు ఇతర సామాగ్రిని కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు 21 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన భన్వర్ రామ్ జాట్ (46), అతని కుమారుడు అశోక్ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితులను గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుబంధు పథకం బంద్... రాహుల్ బంద్ స్టార్

## ముఖ్యమంత్రి రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు



**రాజన్నసిరిసిల్ల :** రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ. 1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ. లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

## ఉద్యోగ నోటిఫికేషన్లపై హామీలకు దిక్కేది

## అసెంబ్లీలో అన్ని సమస్యలపైనా నిలదీస్తాం



**నిజామాబాద్, మార్చి9 :** ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ గాలిలో కలిసింది. అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అభాసుపాలయ్యింది. రెండున్నరేండ్లు గడుస్తున్నా నోటిఫికేషన్లు ఎండమావిగా మారాయని మాజీమంత్రి,, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. వీటన్నటిపైనా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంగడతామని అన్నారు. ఉద్యోగాల కల్పన, హామీలను నిలదీస్తామని అన్నారు. అయితే సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థం అవుతోందన్నారు. నిరుద్యోగులు రెండున్నరేండ్లుగా కండ్లుకాయలు కాసేలా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందంటూ నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. హామీ మేరకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వేముల డిమాండ్ చేశారు. ఇదిలావుంటే పోలీస్‌శాఖలో తక్షణమే 20 వేల పోస్టులతో ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని 'పోలీస్ ఉద్యోగాల నిరుద్యోగ జేఏసీ' డిమాండ్ చేస్తున్నది. భారీగా నిరసలకు పిలుపునిచ్చింది. భారీ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఇప్పటికే ఆవిష్కరించింది. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, వయోపరిమితిని 35 ఏండ్లకు పెంచాలని, జీవో 46ను రద్దు చేయాలని, లాంగ్‌జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలనే ప్రధాన డిమాండ్లతో నిరసన చేపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పోలీస్ ఉద్యోగార్థులకు అలవిగాని హామీలు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం కర్ణాటక తరహాలో ఉద్యమిస్తామని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. జనరల్ ఉద్యోగాలకు తక్షణం నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ నిరుద్యోగ జేఏసీ' ఆధ్వర్యంలో 13న నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైనందున నిరుద్యోగ మార్చ్‌కు భారీగా నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. 13న అసెంబ్లీ ముట్టడితోపాటు, టీజీపీఎస్సీని కూడా ముట్టిస్తామని నిరుద్యోగ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఏడాదికి ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో, బడ్జెట్ సమావేశాలలోపు అన్నిశాఖల్లో ఉన్న ఖాళీలతో మరో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేసారు. 2024 ఆగస్టులో అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితంలా మారిపోయిందని మండిపడ్డారు. ఆ జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు వస్తాయని ఆశించారని, నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో కోచింగ్ సెంటర్లలోనే సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో డబ్బులు పంపేందుకు కూడా తల్లిదండ్రులు సంకోచిస్తున్నారని, స్వగ్రామాలకు వెళ్తే తలెత్తుకొని తిరిగే పరిస్థితి లేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

# నకిలీ మందుల విక్రయంపై కఠిన చర్యలు

## మెడికల్ షాపులకు డిసిఎ ఎస్ఎంఎస్ అలర్ట్

**హైదరాబాద్,మార్చి9 :** నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీసీఏ ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి. ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# చమురు ధరలతో మార్కెట్లు కుదేలు

## రూపాయి విలువ పడడంతె దేశీయ మార్కెట్లపై ప్రభావం

**న్యూఢిల్లీ,మార్చి9 :** పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర వంద డాలర్లు దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిలో ఉండడం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి భారీగా పతనమవడం దేశీయ సూచీలపై నెగిటివ్ ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (78,918)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 2000 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పతనమైంది. మరో ఆరు వందల పాయింట్లు కిందకు వెళ్లింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 70,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2037 పాయింట్ల నష్టంతో 76,881 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. 2.5 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 624 పాయింట్ల నష్టంతో 23,826 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎమ్‌సీఎక్స్ ఇండియా, కోల్ ఇండియా మొదలైన షేర్లు మాత్రమే స్వల్ప లాభాల్లో ఉన్నాయి . ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనో మిండా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, హిందుస్థాన్ పెట్రో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1587 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2280 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.32గా ఉంది.

# ఆర్థిక సంక్షభంతో తగ్గుతున్న పసిడిధరలు

## బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల

**న్యూఢిల్లీ,మార్చి 9 :** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధరలు

## కేంద్రంతో గిరిజన కార్పోరేషన్ ఒప్పందం

**న్యూఢిల్లీ,మార్చి9 :** తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులు సేకరించిన మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ కి కనీస మద్దతు ధర అందించడానికి భారత ప్రభుత్వం, తెలంగాణ గిరిజన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్-చైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ సబ్యసాచి ఘోష్, న్యూఢిల్లీలోని ట్రైఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రాజమురుగన్, ఎంఓయూపై సంతకం చేశారు. నిర్దేశిరచిన మార్గదర్శకాల ప్రకారం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర స్థాయిలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది, గిరిజన సంక్షేమ శాఖ కింద ఉన్న తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ రాష్ట్ర స్థాయిలో అమలు సంస్థగా పనిచేస్తుంది. అవగాహన ఒప్పందంపై సంతకం చేయడంతో, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కార్యక్రమం నెరవేరింది. ప్రధానంగా చిన్న అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడిన గిరిజన రైతులు కనీస మద్దతు ధర ఏర్పాటు ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతారు. ÷ూష్ట్రంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల అధికార పరిధిలో అవసరమైన గోడౌన్లు మరియు హాత్ బజార్‌ల నిర్మాణానికి మద్దతు ఇస్తుంది .

# దస్త్రాల దోషులకు బెయిల్ నిరాకరణ

**న్యూఢిల్లీ,మార్చి9 :** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రెవెన్యూ దస్త్రాల దహనం కేసులో ఇద్దరు నిందితులకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఏ3గా ఉన్న మాధవరెడ్డి, ఏ4గా ఉన్న మునిరత్నానికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. దర్యాప్తు పురోగతికి తాము అడ్డురాలేమని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. నిందితుల్లో ఒకరు మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాజీ పీఏ కాగా, మరొకరు ప్రధాన అనుచరుడిగా ఉన్నారు.

# ఫైర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

## సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం

**హైదరాబాద్,మార్చి9 :** తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ శాఖ యువతను అత్యవసర సేవలు చేరుకునే ముందు ప్రథమ స్పందనకారులుగా తయారు చేయడానికి 'సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ శిక్షణ కార్యక్రమం 09నుండి 15-2026 వరకు మొత్తం ఏడు రోజుల పాటు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సోమవారం నాడు హైదరాబాద్‌లోని పీజీ కాలేజ్, సైఫాబాద్‌ల్గో ÷ర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి. నారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం అన్ని శాఖలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా ఎయిర్ రైడ్స్, కెమికల్ దాడులు, న్యూక్లియర్ ప్రమాదాలు మరియు ఇతర విపత్తుల సమయంలో శిక్షణ పొందిన వాలంటీర్లు ప్రభుత్వ శాఖలకు సహకరించగలరని చెప్పారు. ఈ శిక్షణలో వాలంటీర్లకు రక్షణ చర్యలు, అగ్ని మాపక చర్యలు, ఫస్ట్ ఎయిడ్ చికిత్స, గుంపు నియంత్రణ మరియు సహాయక సామగ్రి పంపిణీ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో వాలంటీర్లు పోలీస్,్గ ÷ర్ సర్వీసెస్, ఎన్‌డీఆర్‌ఎఫ్ మరియు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేస్తారు. అలాగే ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. శిక్షణ పొందిన వాలంటీర్లతో బలమైన కమ్యూనిటీ ఏర్పడడం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఫ్ఓ ఎమ్‌జడ్-1 బి. సుధాకర్ రావు, ప్రిన్సిపల్ డి. కరుణ సాగర్, వైస్ ప్రిన్సిపల్ ఈ. రామా మరియు్గ ÷ర్ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

## ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా

## దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు



**లెబనాన్, మార్చి9 :** ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ ఇరాన్ తన కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త నేతగా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై అమెరికా, ఇరాన్ దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడుల కారణంగా వెలువడుతున్న పొగలు పర్యావరణానికి పెను ముప్పు అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక కొలిక్కివచ్చింది. ఇరాన్‌లోని 88మంది మతగురువులతో కూడిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కొత్త సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు మొజ్తబాను ఎన్నుకుంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో అత్యంత రహస్య వ్యక్తిగా పేరొందిన మొజ్తబా ఖమేనీ, ఇరాన్ యుద్ధ వ్యూహంలో ఇప్పుడు కీలక పాత్ర పోషించనున్నారు. శక్తిమంతమైన రివల్యూషనరీ గార్డ్స్ ఆయన ఆదేశాల మేరకు పనిచేస్తాయి. మొజ్తబా ఇప్పటివరకు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టలేదు. ఇరాన్? సుప్రీం లీడర్?గా మొజ్తబా ఖమేనీ ఎన్నిక కావడం పట్ల ఆ దేశ వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. అనేక మంది మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 1969లో మషాద్ నగరంలో జన్మించిన మొజ్తబా, చిన్నతనం నుంచే తన తండ్రి షా పాలనను చూస్తూ పెరిగారు. ఇరాన్-ఇరాక్ యుద్ధంలో రివల్యూషనరీ గార్డ్స్ తరపున పోరాడారు. 1989లో తన తండ్రి అయాతుల్లా ఖమేనీ సుప్రీం లీడర్ అయిన తర్వాత, మొజ్తబా క్రమంగా తన పట్టును పెంచుకున్నారు. 2008 నాటి వికీలీక్స్ పత్రాలు ఆయన్ను తెర వెనుక అసలు అధికారిగా అభివర్ణించాయి. 2005, 2009 ఎన్నికల్లో అహ్మదీ నెజాద్ గెలుపులో మొజ్తబా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ నాయకత్వంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. అంతకుముందు ఇరాన్? కొత్త నాయకుడు ఎవరైనా తమ ఆమోదం ఉండాలని, లేకపోతే వారు ఎక్కువ కాలం కొనసాగలేరని ట్రంప్? హెచ్చరించారు. మొజ్తాబా నాయకత్వాన్ని తాను అంగీకరించబోనని ఇప్పటికే ట్రంప్ స్పష్టం చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వీడియో సందేశం ద్వారా ఇరాన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇరాన్‌ను నిరంకుశత్వ పాలన నుంచి విముక్తి చేయడమే తమ లక్ష్యమన్న ఆయన, ఇరాన్ ప్రజలు తిరగబడితే ఇరు దేశాలు మళ్లీ మంచి మిత్రులుగా మారే రోజు ఎంతో దూరంలో లేదని పిలుపునిచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది. ఇటీవలే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్తో పుతిన్ ఫోన్లో మాట్లాడారు. దాడుల్లో మరణించిన ఖమేనీ, అతడి కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలు, సైనికులకు పుతిన్ సంతాపం తెలిపారు. దీనికి మసౌద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను అక్కడి అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. 1969లో జన్మించిన మొజ్తాబా ఇరాన్‌లోనే మత గురువుల వద్ద విద్యనభ్యసించారు. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా తండ్రి, ఇరాన్ సుప్రీం లీడర్ అయిన అయతొల్లా ఖమేని, తల్లి, అతడి భార్య కూడా మరణించారు. మొజ్తాబా ఎన్నికతో అతడి మద్దతుదారులు ఇరాన్‌లో సంబరాలు చేసుకుంటున్నారు. కాగా.. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సహకరిస్తోందనే ఆరోపణలున్నాయి. దీనిపై అమెరికా కూడా ఆరోపణలు చేసింది.

# ఇరాన్ సుప్రీం లీడర్‌కు రష్యా మద్దతు

## మొజ్తాబా ఖమేనికి వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు

**మాస్కో,మార్చి 9 :** ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది. ఇటీవలే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్తో పుతిన్ ఫోన్లో మాట్లాడారు. దాడుల్లో మరణించిన ఖమేనీ, అతడి కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలు, సైనికులకు పుతిన్ సంతాపం తెలిపారు. దీనికి మసౌద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను అక్కడి అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. 1969లో జన్మించిన మొజ్తాబా ఇరాన్‌లోనే మత గురువుల వద్ద విద్యనభ్యసించారు. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా తండ్రి, ఇరాన్ సుప్రీం లీడర్ అయిన అయతొల్లా ఖమేని, తల్లి, అతడి భార్య కూడా మరణించారు. మొజ్తాబా ఎన్నికతో అతడి మద్దతుదారులు ఇరాన్‌లో సంబరాలు చేసుకుంటున్నారు. కాగా.. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సహకరిస్తోందనే ఆరోపణలున్నాయి. దీనిపై అమెరికా కూడా ఆరోపణలు చేసింది.

# సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పులు

## రెండో సిలిండర్ బుకింగ్ గడువు 25 రోజులకు పెంపు

**న్యూఢిల్లీ,మార్చి 9 :** దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించి నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సిలెండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడడానికి కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు కేంద్రం పెంచినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిలిండర్లు నిల్వచేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించేందుకు కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వలన కలిగే ఇంధన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు కేంద్రం తాజా చర్యలు చేపట్టింది. చమురు ర్గి÷నైరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని, వాణిజ్య అవరసరాల కంటే గృహ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది.

÷ూగా, ఇంతకుముందు 55 రోజులకు సిలిండర్లు బుకింగ్ చేసుకునే వారు ఇప్పుడు 15 రోజుల్లోనే సిలెండర్లు బుక్ చేసుకుంటున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం సైతం ఎల్జీపీ భాగస్వాముల కోసం ప్రయత్నాలు చేస్తోందని, అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే దేశాలు ఇండియాకు ఎల్పీజీ అమ్మేందుకు సంప్రదింపులు సాగిసున్నాయని ఆ వర్గాలు చెప్పాయి. క్రూడాయిల్ బ్యారెల్ ధర 130 డాలర్లు దాటనంత వరకూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్ వద్ద తగినన్ని ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 100 డాలర్లు దాటకపోవచ్చని అంచనా వేస్తున్నామని, దేశంలోని ఏ ఒక్క పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని ఆ వర్గాలు చెప్పాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ నిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఏటీఎఫ్ ఉత్పత్తి, ఎగుమతిదారుగా ఇండియా ఉన్నందున ఏటీఎఫ్ గురించి ఆందోళన అవసరం లేదని కూడా తెలిపాయి.

# ఈశాన్య రాష్ట్రాల్లో దాడులు ఆందోళనకరం

## అరుణాచల్ బీజేపీ ఎంపీ తపిర్ గావో

**న్యూఢిల్లీ,మార్చి 9 :** ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని బీజేపీ ఎంపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడుల సంఘటనలు కొనసాగుతున్నాయని తెలిపారు. 'ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారు' అని అన్నారు. కాగా, ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని బీజేపీ ఎంపీ తపిర్ గావో తెలిపారు. తమ ప్రాంతం పౌరులను రక్షించడానికి బలమైన చట్టపరమైన చట్రాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. కేంద్ర హోంమంత్రిని కూడా ప్రతినిధి బృందం కలుస్తుందని అన్నారు. ఈశాన్య ప్రాంతాల ప్రజలపై వివక్ష, హింసను నివారించడానికి అట్రాసిటీ చట్టం లాంటి చట్టాన్ని తీసుకురావడాన్ని కేంద్రం పరిగణించాలని ఆయన సూచించారు.

# ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత

## బెంగళూరులో రెస్టారెంట్ల మూసివేత!

## నేటినుండి మూసివేస్తున్నట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి 9 :** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం బెంగళూరులోని రెస్టారెంట్లపై తీవ్రంగా పడింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా హఠాత్తుగా నిలిచిపోయిందని, దీంతో రేపటి నుంచి నగర వ్యాప్తంగా హోటళ్లను మూసివేస్తామని బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. తీవ్ర కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా రేపటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించలేమని ఆ ప్రకటనలో తెలిపింది. గ్యాస్ సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని వెల్లడించింది. యుద్ధం నేపథ్యంలో 70 రోజుల వరకు గ్యాస్ సరఫరాకు గ్యాస్ కంపెనీలు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆ ప్రకటనలో తెలిపింది. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది.

# కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నిక రద్దు

## బిజెపి అభ్యర్థిని విజేతగా ప్రకటన

**భోపాల్, మార్చి 9 :** ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికను హైకోర్టు రద్దు చేసింది. తర్వాత స్థానంలో నిలిచిన బీజేపీ నేతను విజేతగా ప్రకటించింది. అయితే ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేకు వారం గడువు ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లోని విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానానికి గత ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ముఖేష్ మల్హోత్రా గెలిచారు. ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో క్రిమినల్ కేసుల గురించి కీలకమైన సమాచారాన్ని ముఖేష్ మల్హోత్రా దాచిపెట్టినట్లు బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి రాంనివాస్ రావత్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ హైకోర్టు గ్వాలియర్ బెంచ్‌ను ఆయన ఆశ్రయించారు. మరోవైపు ఈ పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. ముఖేష్ మల్హోత్రా తన నామినేషన్ అఫిడవిట్‌లో నాలుగు క్రిమినల్ కేసుల పూర్తి వివరాలను అందించడంలో విఫలమయ్యారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికను రద్దు చేసింది. తర్వాత స్థానంలో నిలిచిన బీజేపీ నేత రాంనివాస్ రావత్‌ను విజేతగా ప్రకటించింది. అయితే ఈ తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖేష్ మల్హోత్రాకు కోర్టు వారం గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తీర్పుపై 15 రోజులు స్టే విధించింది.

# ఫైనల్లో నా ఫామ్‌కు కారణం అతని బ్యాటే

**అసలు విషయం చెప్పిన అభిషేక్ శర్మ**

**ఫైనల్లో శివమ్ దూబే బ్యాట్‌తో అదరగొట్టానన్న అభిషేక్ శర్మ**

**టోర్నీలో ఫామ్ లేక ఇబ్బంది పడ్డానని వెల్లడి**

**కష్టకాలంలో జట్టు సభ్యులు తనకు అండగా నిలిచారని వ్యాఖ్య**

**ఆత్మవిశ్వాసం, కఠోర శ్రమ వల్లే రాణించానన్న యంగ్ ఓపెనర్**




2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ హీరోగా నిలిచాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ పోరులో కేవలం 21 బంతుల్లో 52 పరుగులు చేసి భారత్ భారీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, తన విధ్వంసకర ఇన్నింగ్స్‌కు సహచర ఆటగాడు శివమ్ దూబే బ్యాటే కారణమని, మ్యాచ్ అనంతరం ప్రెస్‌మీట్‌లో తెలిపి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి మూడోసారి టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అభిషేక్ శర్మ మాట్లాడుతూ... "ఈ ఇన్నింగ్స్‌కు క్రెడిట్ శివమ్ దూబేకి దక్కుతుంది. నేను అతని బ్యాట్‌తో ఆడాను. అందుకు అతనికి ధన్యవాదాలు. ఉదయం ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనిపించింది. శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేకపోవడంతో నేను దూబే దగ్గరకు వెళ్లి అతని బ్యాట్ తీసుకున్నాను" అని తెలిపాడు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఈ టోర్నీలో అభిషేక్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. కడుపు ఇన్ఫెక్షన్ బారిన పడటంతో పాటు ఫైనల్‌కు ముందు ఆడిన మ్యాచ్‌లలో కలిపి కేవలం 89 పరుగులు మాత్రమే చేశాడు. కానీ, అత్యంత కీలకమైన ఫైనల్లో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించాడు. గత నెల రోజులుగా తాను ఎదుర్కొన్న కష్టకాలం గురించి అభిషేక్ వివరించాడు. "గత ఏడాదిన్నరగా అద్భుతంగా రాణించాక, గత నెల రోజులుగా నేను ఈ క్లిష్ట దశతో పోరాడుతున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఎవరితో ఉంటామనేది చాలా ముఖ్యం. మన చుట్టూ ఉన్నవాళ్లు మనల్ని మెరుగ్గా మార్చాలని కోరుకుంటే అది పెద్ద మార్పు తెస్తుంది. నేను బ్యాట్‌తో రాణించనప్పుడు కూడా జట్టులోని ప్రతి ఒక్కరూ నాపై నమ్మకం ఉంచారు. 'అతను కచ్చితంగా రాణిస్తాడు' అని చెబుతూనే ఉన్నారు. నా సహచరులను, కోచ్‌లను, సహాయక సిబ్బందిని నేను ఎప్పుడూ సందేహించలేదు" అని అన్నాడు. ఎంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా మనల్ని మనం నమ్మడం మొదటి అడుగు అని అభిషేక్ పేర్కొన్నాడు. "మనపై మనకు సందేహం మొదలైతే ఒత్తిడి పెరిగి, సహజమైన ఆట ఆడలేం. ఆత్మవిశ్వాసం, కఠోర శ్రమ, ఇతరులకు సహాయం చేయడం చాలా ముఖ్యం. మనం ఇతరులకు సహాయం చేస్తే అది ఏదో ఒక రూపంలో మనకే తిరిగి వస్తుంది" అని తెలిపాడు. జట్టు సభ్యులు అందించిన ఈ అద్భుతమైన మద్దతే తనను తిరిగి ఫామ్‌లోకి తెచ్చిందని అభిషేక్ స్పష్టం చేశాడు.



# వరల్డ్ కప్ విజయం ఆ ఇద్దరికే అంకితం

**కష్టాల్లో అండగా ఉన్న వ్యక్తి గురించి గంభీర్ వ్యాఖ్యలు!**

**టీ20 ప్రపంచకప్ విజయాన్ని ద్రవిడ్, లక్ష్మణ్‌కు అంకితమిచ్చిన గంభీర్**

**కష్టకాలంలో జై షా అండగా నిలిచారంటూ భావోద్వేగ వ్యాఖ్యలు**

**మైలురాళ్ల కన్నా ట్రోఫీలే ముఖ్యమని స్పష్టం చేసిన హెడ్ కోచ్**

**చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు కూడా ప్రత్యేక ధన్యవాదాలు**

భారత జట్టు హెడ్ కోచ్‌గా తన తొలి ఐసీసీ ట్రోఫీని గెలిచిన గౌతమ్ గంభీర్ ఈ చారిత్రక విజయాన్ని ఇద్దరు దిగ్గజాలకు అంకితమిచ్చారు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్, ఎన్‌సీఏ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌లకు ఈ కప్‌ను అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో తన కష్టకాలంలో అండగా నిలిచిన ఐసీసీ ఛైర్మన్ జై షాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న అనంతరం గంభీర్ మీడియాతో మాట్లాడారు. "భారత జట్టును పటిష్ఠమైన స్థితిలో ఉంచినందుకు రాహుల్ భాయ్‌కు, భవిష్యత్ తారలను తీర్చిదిద్దుతున్న లక్ష్మణ్‌కు ఈ ట్రోఫీని అంకితం చేస్తున్నా" అని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా నిజాయతీతో పనిచేసిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను కూడా ప్రశంసించారు. తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత క్లిష్ట దశ ఎదురైనప్పుడు జై షా తనకు ఎలా ధైర్యం చెప్పారో గంభీర్ గుర్తుచేసుకున్నారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్‌లు ఓడిపోయినప్పుడు తానెంతో కుంగిపోయానని, ఆ సమయంలో జై షా ఫోన్ చేసి తనపై నమ్మకం ఉంచారని గంభీర్ తెలిపారు. ఆ నమ్మకమే ఈ విజయానికి కారణమని ఆయన పరోక్షంగా వెల్లడించారు. "మన దేశంలో వ్యక్తిగత మైలురాళ్లను ఎక్కువగా సెలబ్రేట్ చేస్తారు. కానీ ట్రోఫీలే ముఖ్యం. ఆ మార్పు కోసమే నేను పనిచేస్తున్నా" అని గంభీర్ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ పటిమ తన పనిని సులభతరం చేసిందని కొనియాడారు.

**ఈ సమయంలో కోహ్లీ గురించి చర్చ అవసరం లేదు: గౌతమ్ గంభీర్**

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్ టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను ముద్దాడిన వేళ, టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన వ్యాఖ్యలు క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో 96 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రపంచ కప్ విజయం అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విరాట్ కోహ్లీ ప్రస్తావన రాగా, గంభీర్ తనదైన శైలిలో స్పందించారు. టోర్నీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ కుప్పకూలిన సందర్భాన్ని గుర్తు చేస్తూ, కోహ్లీ వంటి సీనియర్ ఆటగాడి లోటు కనిపిస్తోందా? అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దీనికి గంభీర్ ఏమాత్రం తడబడకుండా, "అస్సలు మిస్ అవ్వలేదు.. ఒక్క శాతం కూడా మిస్ కాలేదు" అని స్పష్టం చేశారు. ప్రస్తుత జట్టులోని ఆటగాళ్లపై తనకు పూర్తి నమ్మకం ఉందని, బయట నుంచి ఎవరి అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా, ప్రతి చిన్న విషయానికి విరాట్ కోహ్లీ పేరును తీసుకురావాల్సిన అవసరం లేదని గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ రోజు మనం ప్రపంచ కప్ గెలిచాం.. ఈ జట్టులోని ఆటగాళ్లందరూ ఛాంపియన్స్. కాబట్టి విజయం సాధించిన వారి గురించి మాత్రమే ఇప్పుడు మాట్లాడాలి. ఈ సమయంలో కోహ్లీ గురించి చర్చ అనవసరం" అని గంభీర్ ఘాటుగా సమాధానమిచ్చారు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ వంటి యువ రక్తం అద్భుత ప్రదర్శనతో భారత్‌కు ట్రోఫీని అందించిన తరుణంలో, గంభీర్ చేసిన ఈ వ్యాఖ్యలు కోహ్లీ అభిమానులు, క్రికెట్ విశ్లేషకుల్లో భిన్నాభిప్రాయాలకు దారితీస్తున్నాయి.

# పాతవన్నీ మర్చిపోయారా?

**ధోనీ, గంభీర్ మధ్య ఆసక్తికర సంభాషణ**

**టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు ధోనీ అభినందనలు**

**కోచ్ గంభీర్‌ను నవ్వమంటూ ప్రత్యేకంగా పోస్ట్ చేసిన మాజీ కెప్టెన్**

**ధోనీ వ్యాఖ్యలకు హుందాగా స్పందించిన గౌతమ్ గంభీర్**

**ఇద్దరు దిగ్గజాల మధ్య సంభాషణతో అభిమానుల్లో ఆనందం**

**బూమ్రాను 'ఛాంపియన్ బౌలర్' అంటూ కొనియాడిన ధోనీ**



అహ్మదాబాద్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. ఈ చారిత్రక విజయం తర్వాత, భారత క్రికెట్‌లోని ఇద్దరు దిగ్గజాలైన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్‌ల మధ్య సోషల్ మీడియాలో జరిగిన సంభాషణ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. వారిద్దరి మధ్య ఉన్న పాత విభేదాల ఊహాగానాలకు ఈ సంఘటన తెరదించినట్లు అయింది. భారత్ విజయం సాధించిన వెంటనే, ధోనీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో జట్టును అభినందిస్తూ ఒక పోస్ట్ చేశాడు. "అహ్మదాబాద్‌లో చరిత్ర సృష్టించారు. జట్టుకు, సహాయక సిబ్బందికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత క్రికెట్ అభిమానులందరికీ నా అభినందనలు. మీ అందరి ఆట చూడటం చాలా ఆనందంగా ఉంది" అని పేర్కొన్నాడు. ఇదే పోస్టులో గంభీర్‌ను ప్రత్యేకంగా ఉద్దేశిస్తూ, "కోచ్ సాబ్, నవ్వు మీ ముఖంలో చాలా బాగుంది. తీవ్రతతో కూడిన చిరునవ్వు ఒక కిల్లర్ కాంబో. అద్భుతంగా పనిచేశారు. ఎంజాయ్ చేయండి" అని రాశాడు. చివర్లో బూమ్రాను ప్రశంసిస్తూ, "బూమ్రా గురించి ఏమీ రాయకపోవడమే మంచిది. ఛాంపియన్ బౌలర్" అని చమత్కరించాడు. ధోనీ చేసిన ఈ వ్యాఖ్యకు గంభీర్ కూడా అంతే హుందాగా స్పందించారు. "నవ్వడానికి ఇంతకంటే మంచి కారణం ఏముంటుంది, మిమ్మల్ని చూడటం చాలా సంతోషంగా ఉంది" అని బదులిచ్చారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్‌గా మారింది. గత కొన్నేళ్లుగా ధోనీ, గంభీర్ మధ్య సత్సంబంధాలు లేవని, వారి మధ్య విభేదాలు ఉన్నాయని అనేక చర్చలు జరిగాయి. ముఖ్యంగా 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ధోనీ కొట్టిన విన్నింగ్ సిక్స్‌పై గంభీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ అభిమానుల మధ్య చర్చనీయాంశంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫైనల్ మ్యాచ్‌కు ధోనీ ప్రత్యేకంగా హాజరు కావడం, 2024 టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ట్రోఫీని మైదానంలోకి తీసుకురావడం విశేషం. ప్రపంచకప్ విజయం అందించిన ఆనందానికి, ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య కనిపించిన స్నేహపూర్వక వాతావరణం తోడవడంతో భారత క్రికెట్ అభిమానుల సంతోషం రెట్టింపయింది.

# గంభీర్ పాలసీ సూపర్ హిట్...

**బీసీసీఐ సిస్టమ్ గెలిచింది: షోయబ్ అక్తర్**



టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో టైటిల్‌ను నిలబెట్టుకున్న తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి, మూడోసారి టీ20 కప్‌ను ముద్దాడిన టీమిండియాపై పాకిస్థాన్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజాలను పక్కనపెట్టి కొత్త జట్టును తయారు చేయాలన్న భారత్ నిర్ణయం నూటికి నూరు శాతం సరైనదేనని ఈ విజయంతో రుజువైందని కొనియాడాడు. 2024 టీ20 వరల్డ్ కప్ విజయానంతరం రాహుల్ ద్రవిడ్ స్థానంలో గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఆ తర్వాత రోహిత్, కోహ్లీ, జడేజా లాంటి సీనియర్లు ఈ ఫార్మాట్‌కు దూరం కాగా.. గంభీర్ పూర్తిగా 'టీమ్ ఫస్ట్' అనే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాడు. యువ ఆటగాళ్లకు పెద్దపీట వేస్తూ కొత్త జట్టును నిర్మించాడు. ఈ పరిణామాలపై పాకిస్థాన్ మీడియా చానల్ 'ట్యాప్‌మాడ్'తో మాట్లాడిన అక్తర్.. భారత క్రికెట్ వ్యవస్థను ఆకాశానికెత్తాడు. "భారత్ పాలసీ గెలిచింది. వారి సిస్టమ్, మేనేజ్‌మెంట్ గెలిచాయి. 2024 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో భాగమైన కెప్టెన్ రోహిత్ శర్మ, లెజెండ్ విరాట్ కోహ్లీలను వారు వదిలేశారు. ఆ దిగ్గజాలను పక్కనపెట్టి ముందుకు సాగారు. వారు తీసుకున్న ఆ నిర్ణయం ఎంత సరైనదో ఈ రోజు ప్రపంచానికి రుజువు చేశారు" అని అక్తర్ విశ్లేషించాడు. గౌతమ్ గంభీర్ అందరితో పోరాడి మరీ సంజు శాంసన్, అభిషేక్ శర్మ లాంటి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చి అండగా నిలిచాడని ప్రశంసించాడు. అభిషేక్ శర్మ ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ, సరైన అవకాశాలు ఇస్తే అద్భుతాలు చేయగలడని గంభీర్ నమ్మాడని, ఆ నమ్మకమే ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు. బీసీసీఐ వ్యవస్థ పనితీరును కూడా అక్తర్ ప్రత్యేకంగా అభినందించాడు. రంజీ ఆడుతున్న క్రికెటర్లకు ఆర్థిక భరోసా కల్పించడం, మౌలిక సదుపాయాలపై పెట్టుబడి పెట్టడం, అదే సమయంలో రోహిత్, ధోని లాంటి సీనియర్లను గౌరవించే విధానం అద్భుతమన్నారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఎంపిక జరిగితే విజయాలు వాటంతట అవే వస్తాయని స్పష్టం చేశాడు. ఇక టోర్నీ సాగిన తీరును గమనిస్తే.. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 7 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించిన భారత్, ఫైనల్‌లో ఏకంగా 96 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం కివీస్‌ను 159 పరుగులకే కట్టడి చేసి సత్తా చాటింది. తద్వారా రికార్డు స్థాయిలో మూడోసారి టీ20 కప్ ను చేజిక్కించుకుంది. ఈ నేపథ్యంలో, పాత దిగ్గజాల స్థానంలో వచ్చిన కొత్త తరం ఆటగాళ్లు బాధ్యతను భుజానికెత్తుకుని అద్భుతాలు చేయడమే భారత క్రికెట్ విజయ రహస్యమని షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించాడు.

# కప్ గెలిచాక ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఎమోషనల్

**వీడియో విడుదల చేసిన బీసీసీఐ**



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి టీ20 వరల్డ్ కప్ 2026 టైటిల్‌ను సొంతం చేసుకోవడంపై టీమిండియా ఆటగాళ్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఎమోషనల్ అయ్యారు. ఈ చరిత్రాత్మక విజయం తర్వాత వారిద్దరూ తమ ఆనందాన్ని పంచుకున్న ఒక వీడియోను బీసీసీఐ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఇషాన్ కిషన్ మాట్లాడుతూ.. ఆతిథ్య దేశం టీ20 వరల్డ్ కప్ గెలవడం ఇదే తొలిసారి అని గుర్తుచేశాడు. "మేము ప్రాణం పెట్టి ఆడాం. టోర్నీ ఆసాంతం ఒకరికొకరు అండగా నిలబడ్డాం. 2023 వరల్డ్ కప్ ఫైనల్ ఓడిపోయినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లో అందరం ఏడ్చాం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సపోర్ట్ స్టాఫ్, జట్టు సభ్యులందరి కృషితోనే ఈ ట్రోఫీని ఎత్తగలిగాం" అని ఇషాన్ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ టోర్నీలో తాను ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడినప్పుడు జట్టు అండగా నిలిచిన తీరును అభిషేక్ శర్మ గుర్తుచేసుకున్నాడు. "వరల్డ్ కప్ గెలవడం నా కెరీర్‌లోనే బెస్ట్ మూమెంట్. ఒక దశలో పరుగులు చేయలేక ఇబ్బంది పడ్డాను. కానీ కోచ్‌లు, టీమ్ నాకు అండగా నిలిచారు. ఏ రోజూ నన్ను ఒంటరిగా వదిలేయలేదు. నా జట్టును చూసుకుంటే చాలా గర్వంగా ఉంది" అని అభిషేక్ భావోద్వేగానికి గురయ్యాడు. పరుగులు రానప్పుడు కూడా అభిషేక్ చాలా పాజిటివ్‌గా ఉన్నాడని, ఇతరులకు సహాయం చేసేవాడని ఇషాన్ ప్రశంసించాడు. గత వరల్డ్ కప్ మ్యాచ్‌లను ఇంట్లో కూర్చుని చూశానని, ఇప్పుడు స్వయంగా ఆడి కప్పు గెలవడం ఒక కల నిజమైనట్లుగా ఉందని అభిషేక్ శర్మ వివరించాడు.

# 99 రోజుల లక్ష్యంతో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'

## హుస్నాబాద్‌ను ఆదర్శంగా నిలపాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్





హుస్నాబాద్,జనత న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' ద్వారా గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమవతి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. పది ప్రత్యేక అంశాల ప్రాతిపదికన రూపొందించిన ఈ ప్రణాళిక నిర్వహణలో హుస్నాబాద్ మండలం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వివిధ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. హుస్నాబాద్ ప్రజల కోసం సురభి, ఆర్వీఎం, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలల ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. విద్యా వ్యవస్థ బలోపేతంపై మాట్లాడుతూ..మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 1,700 నుండి 2,500కు పెంచాలని, అధిక ఎన్రోల్మెంట్ సాధించే పాఠశాలలకు ప్రత్యేక నిధులు, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.యువత గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో మార్పులు రావాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ వంటి ఉద్యానవన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, బ్యాంకు లింకేజీ రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ నివారణలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు అందించిన స్టీల్ బ్యాంకులను కచ్చితంగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.జిల్లా కలెక్టర్ హైమవతి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తమ గ్రామాభివృద్ధిని నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని, 99 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'సాహస్' స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో 17 గ్రామ పంచాయతీలకు మంత్రి చేతుల మీదుగా ఉచిత మైక్ సెట్లను పంపిణీ చేశారు. అనంతరం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాళం ఇచ్చిందే నువ్వు రసమయి

### బెజ్జంకి మండల కాంగ్రెస్ నాయకులు.



జనత న్యూస్ బెజ్జంకి : మన కొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ఆదివారం పాత్రికేయుల సమావేశంలో మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మరియు మండల కాంగ్రెస్ నాయకులపై చేసిన ఆరోపణలు అర్ధరహితమని దొంగ తన దొంగతనాన్ని ఇతరులపై నెట్టే విధంగా ఉందని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గ దామోదర్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డిలు ధ్వజమెత్తారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసమయి బాలకిషన్ చేసిన అసత్య ఆరోపణలు అర్థరహితమైనవి , మీ ప్రభుత్వంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చిందే మీరు మర్చిపోయారా , వసూళ్లకు తెరలేపింది మీరు , ప్రజా ప్రభుత్వంలో దొంగతనాలను బయటకు తీస్తుంటే తట్టుకోలేక, మతి భ్రమించి, మా ఎమ్మెల్యే పై , మండల కాంగ్రెస్ నాయకులపై, కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లి ప్రయత్నం చేస్తూ అభద్రత భావానికి గురవుతున్నావని , రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి అక్రమంగా ఆస్తులు సంపాదించింది నువ్వు, మీ ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలు కట్టలేక రాష్ట్ర ఖజానాకు గండి పడుతుంది ఈ విషయం నువ్వు గమనించాలి , నీకు రాష్ట్ర ఖజానా గురించి తెలిసి కూడా దొంగకు తేలు కుట్టిన విధంగా వ్యవహరిస్తున్నావని విమర్శించారు. అక్రమ ఫ్యాక్టరీ నుండి వసూలు చేసిన పాపపు సొమ్ముతో అభివృద్ధి చేసే , కర్మ , పిల్లలకు షూలు ఇచ్చే కర్మ ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాలేదని, రెండు రోజులు లేట్ అయిన కచ్చితంగా అభివృద్ధి సంక్షేమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కర వెని పోచయ్య , ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు బోనగం రమేష్ గౌడ్, ఏలిగా సతీష్ , మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, బోనాల మల్లేశం, పూర్మ నారాయణరెడ్డి, కత్తి రమేష్ గౌడ్, బండి వేణు యాదవ్, బోనగం శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ భిక్ష పెట్టిన నాయకుడిపైనే విమర్శలా?

### కృతఘ్నత వీడకుంటే రాజకీయ పుట్టగతులు ఉండవు

### మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పై విమర్శలు సిగ్గుచేటు

### బీఆర్ఎస్ మండల నాయకుల ధ్వజం



చిగురుమామిడి,జనత న్యూస్:రాజకీయంగా జన్మనిచ్చి, అన్ని రకాలుగా ఆదరించిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పై విమర్శలు చేయడం గీకురు రవీందర్ అజ్ఞానానికి నిదర్శనమని, ఇలాగే వ్యవహరిస్తే రాజకీయంగా పుట్టగతులు ఉండవని బీఆర్ఎస్ మండల నాయకులు హెచ్చరించారు.సోమవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఇతర నాయకులతో కలిసి మాట్లాడారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో అన్ని రకాల పదవులు అనుభవించి, వ్యక్తిగతంగా లబ్ధి పొందిన రవీందర్.. నేడు స్వార్థం కోసం పార్టీ మారి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను, సాగునీరు, విద్యుత్ కోతల సమస్యలను మాజీ ఎమ్మెల్యే ప్రశ్నిస్తే.. వాటికి సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం వారి అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు.మంత్రి పొన్నం ప్రభాకర్ వద్ద మార్కులు కొట్టేయాలనే అత్యుత్సాహంతోనే రవీందర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సతీష్ కుమార్ పెట్టిన రాజకీయ భిక్షతో ఎదిగిన రవీందర్ కు ఆయన పేరు పలికే అర్హత కూడా లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒక చెల్లని రూపాయిలా తిరుగుతున్న రవీందర్ తీరును ప్రజలు గమనిస్తున్నారని...భవిష్యత్తు ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్, మాజీ మండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, మాజీ సర్పంచులు కనుగంటి భూమిరెడ్డి, బోయిని శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు హనుమాన్ల సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు కత్తుల రమేష్ యాదవ్, పల్లి వేణు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మక్బూల్ పాషా, సీనియర్ నాయకులు మహంకాళి కొమరయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్వర్ పాషా, దొనపాటి కిష్టరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ హైమావతి



సిద్ధిపేట, జనతా న్యూస్, మార్చి 9: ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా 99 రోజులు చురుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికను జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలను ప్రతిరోజు గ్రామ స్థాయి వరకు నిర్వహించాలని తెలిపారు. నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఫోటోలతో సహా ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం కార్యక్రమాలను అన్ని శాఖల్లో నిర్వహించి కార్యాలయాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో వీధులు శుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రవాణా శాఖ ద్వారా డ్రైవర్లకు వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, గృహ మరియు వ్యవసాయ అవసరాలకు సరఫరా చేస్తున్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను సరిచేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు సిద్ధిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న సిహెచ్సీలలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 12న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై మున్సిపల్ కమిషనర్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అబ్దుల్ హమీద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళ అభ్యున్నతితోనే గ్రామాల అభ్యున్నతి

### వడ్లూరు గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్.



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూర్ గ్రామంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ గ్రామంలోని వివిధ రంగాల్లోని మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడుతూ మహిళా అభ్యున్నతితోనే గ్రామ అభ్యున్నతి సాధ్యమని, ప్రతి కుటుంబంలో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తల్లిగా, భార్యగా మహిళా పాత్ర అమోఘమని కొని ఆడారు. ఓర్పుతో సహనంతో జీతం లేని శ్రామికురాలు మహిళ అని ప్రశంసించారు. భారతదేశం లో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఉందని, మన దేశ మాతను ఒక మహిళగా అనువాయించుకొని అత్యున్నత గౌరవం ఇచ్చామని , సమాజ అభివృద్ధిలో దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెజ్జంకి మరియా అనిల్, వార్డు సభ్యులు పులి శ్రీకాంత్ గౌడ్, మాంకాల స్వామి, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘం వివోఏలు, గ్రామ మహిళలు, పంచాయతీ కారోబార్ పులి పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా '2K రన్

### భాగస్వాములైన చైర్ పర్సన్, కౌన్సిలర్లు, ప్రజలు



కోరుట్ల,జనతా న్యూస్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రణాళిక' లో భాగంగా సోమవారం కోరుట్ల పట్టణంలో '2K రన్' ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక కృష్ణా మందిరం వద్ద ప్రారంభమైన. ఈ పరుగులో మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ యువతీ యువకులు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, మాట్లాడుతూ.. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులో శ్రమదానం నిర్వహించాలని, కౌన్సిలర్లు అందరూ తమ వార్డుల్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ కోరుట్లను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యమన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే తడి, పొడి హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ బట్ట సంచులను వెంట తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత మున్సిపల్ కమిషనర్ రవీందర్,మున్సిపల్ కౌన్సిలర్లు, పురపాలక సంఘం సిబ్బంది, పట్టణ ప్రజలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా 'కళాకృతి' వార్షికోత్సవ వేడుకలు




కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో ఉన్న అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ -- భగత్ నగర్ శాఖ ఆధ్వర్యంలో "కళాకృతి" పేరుతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. వేడుకల ప్రారంభానికి ముందు సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే జీవితంలో విజయాలను సాధించగలరన్నారు. తల్లిదండ్రులు పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. తల్లిదండ్రుల మార్గదర్శకంతో చదువుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో బోధించే విషయాలను విశ్లేషణాత్మకంగా నేర్చుకుని వాటిపై పట్టు సాధించాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో నవాబుపేట గ్రామం ఆదర్శంగా నిలవాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నవాబుపేట గ్రామం రోల్ మోడల్‌గా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామంలో సమస్యల పరిష్కారానికి గ్రామస్తులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులంతా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో హాజరు శాతం పెంచడంతో పాటు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గ్రామస్తులు అనవసరంగా డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలని అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నవాబుపేట గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గ్రామస్తులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం నవాబుపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే పశువైద్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిపిఓ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీధర్, ఆర్డిఓ మహేశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, తహసిల్దార్ రమేష్, గ్రామ సర్పంచ్ గూళ్ల రజిత రాజు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు ఆదర్శంగా నిలవాలి:

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అమలులో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను నంబర్ వన్‌గా నిలపాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశాల్లో జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి గొప్ప అవకాశమని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పనులను వేగవంతం చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపని గ్రామాలకు ఎంత పెద్ద పనైనా చేసి పెడతానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి వ్యక్తికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అధికారులు సమిష్టిగా కృషి చేసి కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతం చేస్తామని తెలిపారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ మోడ్‌లో పనిచేయాలని సూచించారు. ప్రజలను కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి శాఖల వారీగా సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. తమ పరిధిలో లేని దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులపై కూడా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 352 దరఖాస్తులు వచ్చాయి. వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, జనతా న్యూస్, మార్చి 9: సోమవారం సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని జిల్లా మహిళ సమాఖ్య భవనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని పేర్కొన్నారు. పూర్వకాలం నుండి స్త్రీలను వివిధ దేవతల రూపాల్లో పూజిస్తున్నారని తెలిపారు. మహిళలు బలహీనులు కాదని, కుటుంబంలో ఎన్నో బాధ్యతలను నిర్వర్తిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళల్లో అపారమైన శక్తి, సామర్థ్యం ఉన్నాయని, ఆ శక్తిని గుర్తించి జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. మంచి నిర్ణయాలు తీసుకుని పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలపై మాత్రమే ఆధారపడకుండా మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ఎదిగి వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలని సూచించారు. నాబార్డ్, బ్యాంకులు మరియు ఇతర సంస్థల ద్వారా లభించే రుణాలు, శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకుని మహిళలు వివిధ రంగాల్లో ముందుకు రావాలని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా సహకార శాఖ అధికారి వరలక్ష్మి, తూనికలు కొలతల శాఖ అధికారి, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, జనతా న్యూస్, మార్చి 9: కొహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో రాత్రి భోజన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అన్నం, మిల్మికర్ కూర, సాంబారు వంటి వంటకాలను పరిశీలించారు. మెనూలో భాగంగా ఉండాల్సిన చట్నీ తయారు చేయకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు కడుపునిండా భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టోర్‌లో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి నాణ్యమైన ఆహార పదార్థాలనే వినియోగించాలని సూచించారు. అందుబాటులో ఉన్న టమాటా, బీరకాయ, ఆకుకూరలతో చట్నీ తయారు చేసి అందించాలని తెలిపారు. వండిన ఆహారం రుచికరంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ఆహారం రుచిగా ఉందా అని అడగగా బాగుందని విద్యార్థులు తెలిపారు. తర్వాత కోహెడ మండలంలోని నాగసముద్రాల గ్రామంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న అన్నం, క్యాబేజీ కూర, సాంబారు, పెరుగు వంటి వంటకాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేయగా రికార్డుల్లో నమోదైన క్యాబేజీ పరిమాణం, వండిన కూర పరిమాణం మధ్య తేడా ఉన్నట్లు గుర్తించి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం చట్నీ తయారు చేయకపోవడం, రిజిస్టర్‌ను సరిగా నిర్వహించకపోవడంపై వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా




కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఉందని, గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో అమలవుతున్న వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామానికి ఆరోగ్య సేవలు సమర్థంగా చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్యశాఖ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అన్ని విధాలుగా సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా తల్లి--శిశు ఆరోగ్యం, టీకా కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలు మెరుగుపరచాలని, ప్రభుత్వ వైద్యం పై ప్రజల్లో మరింత నమ్మకం పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి సనా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, వీవో ఎన్‌సీడీ ఉమశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రాజగోపాల్, చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సంతోష్

### బాధ్యతలు స్వీకరించిన అధికారి

**హైదరాబాద్,మార్చి 9 :** గిరిజన సంక్షేమశాఖ నూతన సంచాలకులుగా సంతోష్ బి.ఎం బాధ్యతలు సవీకరించారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం సంతోష్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వారి వారి విధులు, పనులను గూర్చి సమీక్ష చేశారు. చేయవలసిన పనులను గూర్చి తనకు విభాగాల వారీగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ-ఫైల్స్ పెట్టడం కూడా ప్రారంభించాలన్నారు. విభాగాలవారీగా అధికారులు తమ విధులు, బాధ్యతల గురించి తనకు వివరాలు ఇవ్వాలని, ఆ మేరకు పనులు చేసుకుంటూ వెళ్తామని అన్నారు. గిరిజన సంక్షేమ పథకాలు అన్ని కూడా అడవులలో చివరి మజిలీలో ఉన్న చివరి గిరిజనులకు కూడా చేరేటట్లు ప్రణాళికలు రచించాలని, ప్రత్యేకించి గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గిరిజన సంక్షేమం మీద పూర్తి అవగాహన ఏర్పరచుకుని వారం రోజులలో గిరిజన ప్రాంతాలలో పర్యటించి గిరిజన సమస్యలను, సంక్షేమ అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా చర్యలు ÷ఖసుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా సంతోష్ బి.ఎం. కి గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బాలు, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల, జీసీసీ జీఎం ప్రతాప్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు పోచం, శ్రీమతి సంధ్యారాణి తదితర అధికారులు పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానించారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సచివాలయానికి వెళ్ళి సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ గారికి పూల మొక్క ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

## మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2 కిలోమీటర్ల రన్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు, ట్రైనీ పోలీస్ సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా అంబేద్కర్ స్టేడియం వరకు 2 కిలోమీటర్ల రన్ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ స్టేడియం పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్లాస్టిక్, గాజు ముక్కలు వంటి వ్యర్థాలను సేకరించారు. కలుపు మొక్కలను తొలగించి స్టేడియం ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ నివాస గృహాలతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నగరంలోని 66 డివిజన్లలో పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, బస్తీ దవాఖానాలు, పాఠశాలలు వంటి అన్ని ప్రభుత్వ భవనాలను శుభ్రపరుస్తున్నామని చెప్పారు. ప్రతి రోజు ఐదు డివిజన్లను ఎంపిక చేసి అదనపు పారిశుధ్య కార్మికులతో పరిసరాలు, డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి డివిజన్‌కు అవసరమైన అభివృద్ధి పనుల కోసం రూ.5 లక్షల నిధులు కేటాయించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణలో నగరానికి మంచి ర్యాంకు వచ్చేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నగర పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యం బాగుంటేనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బయట వేయకుండా నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని సూచించారు. ప్రతి రోజు ఐదు డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని చెప్పారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 2 వరకు 99 రోజుల కార్యాచరణతో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు, అధికారులు, పోలీస్ ట్రైనింగ్ సిబ్బంది, విద్యార్థులు, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దశల వారిగా ప్రజల సమస్యల పరిష్కారం: మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: ప్రజల సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నగరంలోని 13వ డివిజన్ మార్కండేయ నగర్ కాలనీలో కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్‌తో కలిసి రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లో పారిశుధ్య పనులు చేపట్టి స్థానికులు సూచించిన డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. 14వ డివిజన్ చింతకుంట రాజీవ్ స్వగృహా కాలనీలో సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్‌తో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలోని సమస్యలను పరిశీలించి రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. 15వ డివిజన్ చింతకుంట గణేష్ నగర్ కాలనీలో కార్పొరేటర్ విప్పుల సాయి జ్యోతితో కలిసి రూ.5 లక్షలతో డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. 16వ డివిజన్ మల్కపూర్‌లో కార్పొరేటర్ కాంతాల జగన్ రెడ్డితో కలిసి రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. 17వ డివిజన్ కొత్తపల్లి ప్రాంతంలో కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్‌తో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులకు, 18వ డివిజన్ కొత్తపల్లిలో కార్పొరేటర్ వాసాల రమేష్‌తో కలిసి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సంబంధిత డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఖాళీ స్థలాలు, పరిసరాలు శుభ్రం చేశారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించి రోడ్లు, డ్రైనేజీల వద్ద ఉన్న కలుపు మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మేయర్‌ను శాలువాతో సన్మానించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల డివిజన్లలో ప్రజలు తెలిపిన సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని తెలిపారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులు చేపడతామని చెప్పారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ ఐదు డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాజ రమ శివరాం, ఈఈ సంజీవ్ కుమార్, డీఈలు ఓం ప్రకాష్, శ్రీనివాస్, ఎంహెచ్‌వో సుమన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# 14న బండి సంజయ్ 'అంజన్న ఆశీర్వాద యాత్ర' మహా పాదయాత్ర

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈనెల 14న "అంజన్న ఆశీర్వాద యాత్ర" పేరుతో మహా పాదయాత్ర చేపట్టనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉపసర్పంచులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు దాదాపు 10 వేల మంది కార్యకర్తలతో కలిసి ఈ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర ఈనెల 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి ప్రారంభమవుతుంది. రేకుర్తి, కొత్తపల్లి, గంగాధర, పూడూరు, కొడిమ్యాల, మల్యాల మీదుగా దాదాపు 40 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కొండగట్టుకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోనున్నారు. కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వెళ్లి మొక్కులు తీర్చుకుంటానని బండి సంజయ్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వడంతో పాటు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకోవడంతో ఇచ్చిన మాట ప్రకారం పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పాదయాత్ర విజయవంతం చేసేందుకు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇన్‌చార్జ్‌లు భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పాదయాత్రలో బండి సంజయ్‌తో కలిసి పాల్గొనేందుకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల నుంచి మండల, జిల్లా స్థాయి నాయకుల వరకు అందరూ ఈ మహాపాదయాత్రలో పాల్గొననున్నారు. రాజకీయాలకు అతీతంగా భక్తి గీతాలు, డప్పు చప్పుళ్లతో ఆధ్యాత్మిక వాతావరణంలో పాదయాత్ర కొనసాగనుంది. పాదయాత్ర దారిపొడవునా గ్రామాల ప్రజలు మంగళహారతులు, పూలతో ఘన స్వాగతం పలకేందుకు సిద్ధమవుతున్నారు. కార్యకర్తలకు తాగునీరు, మజ్జిగ, పులిహోర వంటి ఏర్పాట్లు చేయడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు సహకారం అందించనున్నాయి.

# ప్రజావాణిలో 23 దరఖాస్తులు స్వీకరణ



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ విభాగాలకు సంబంధించిన సమస్యలపై మొదటి రోజు మొత్తం 23 దరఖాస్తులు వచ్చినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థకు చెందిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, బర్త్ అండ్ డెత్ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నగర ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను విభాగాల వారీగా స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యంతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు నేరుగా ప్రజావాణిలో సమస్యలు తెలియజేయడం ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించి వారం రోజులలో పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగర ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ సందర్శించి తనిఖీ చేశారు. సెక్షన్ల వారీగా కార్యాలయ గదులను పరిశుభ్రంగా ఉంచాలని, ఫర్నిచర్, ర్యాకులను శుభ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పనికిరాని వస్తువులు కార్యాలయ గదుల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, పలు సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే నిధులు కేటాయించాలి: సంధి తిరుపతిరెడ్డి



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 10: పేద రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించినప్పటికీ రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. వెంటనే కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రూ.2000 కోట్లతో ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. పేద రెడ్డి యువతకు ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి కార్పొరేషన్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. నెల రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకపోతే ఏప్రిల్ నెల చివరి వారంలో కరీంనగర్‌లో రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్ని రెడ్డి సంఘాలను కలుపుకొని "రెడ్ల రణభేరి" పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి తమ శక్తిని చాటిచెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com